క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కర్లపాలెం: కర్లపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని బుద్ధాం, యాజలి లెవెన్ కేవీ ఫీడర్ల పరిధిలోని పలు గ్రామాలలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ మల్లెల కుమార్ మంగళవారం తెలిపారు. బుద్ధాం, యాజలి, దుండివారిపాలెం, దమ్మనవారిపాలెం, తిమ్మారెడ్డిపాలెం, శ్రీరామ్‌నగర్, బోలాయపాలెం, నాగరాజుపాలెం గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు. గృహ వినియోగదారులు, ఆక్వా రైతులు తమకు సహకరించాలని ఏఈ కుమార్ కోరారు.

గోపీకృష్ణ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



కర్లపాలెం: దాసరి గోపీకృష్ణ కుటుంబానికి అండగా నిలిచి ఆదుకుంటామని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు తెలిపారు. ఇటీవల అమెరికాలో దుండగుడి కాల్పులలో మృతి చెందిన దాసరి గోపీకృష్ణ తల్లిదండ్రులను మంగళవారం ఎమ్మెల్యే నరేంద్రవర్మ పరామర్శించి ఓదార్చారు. కష్టాలలో ఉన్నప్పుడే ధైర్యంగా ఉండాలని పార్టీ పరంగా అండగా నిలుస్తామని భరోసా నిచ్చారు. గోపీకృష్ణ తల్లిదండ్రులను బిగ్‌బాస్ విన్నర్ కౌశల్, జనసేన నాయకులు లక్ష్మీనరసింహ, శివనారాయణ పరామర్శించారు.

రేపు దేవాలయాలలో హుండీల లెక్కింపు

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో గల దేవాలయాలలో భక్తులు సమర్పించిన కానుకల హుండీలను ఈ నెల 27న లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చందోలు బండ్లమ్మ దేవాలయం, శ్రీ లింగోద్భవ స్వామి దేవాలయం, శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయాలలో భక్తులు సమర్పించిన కానుకల హుండీలను లెక్కించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన పురుష భక్తులు ఈ లెక్కింపులో పాల్గొనవచ్చని తెలిపారు.

పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరం

ఫిరంగిపురం: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు చాలావరకు దూరమవుతాయని బఫర్ వైద్యురాలు ప్రియాంక అన్నారు. మరీ ముఖ్యంగా భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. మండలంలోని మునగపాడు గ్రామంలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 180 మందికి డాక్టర్ ప్రియాంక షుగర్, బీపీ తదితర పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు.

డయేరియా ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

- ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి
- స్టాప్ డయేరియాపై ఇంటర్ సెక్టోరల్ కోఆర్డినేషన్ సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ లలిత కుమారి పక్కన ఎంపీడీవో, అధికారులు

భట్టిప్రోలు: ప్రస్తుతం గ్రామాల్లో డయేరియా విజృంభిస్తుండటంతో ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉన్న దృష్ట్యా పంచాయతీ అధికారులు అప్రమత్తమై ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి కోరారు. మంగళవారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జేబీవీ మల్లికార్జునరావు అధ్యక్షతన స్టాప్ డయేరియాపై మండల స్థాయి ఇంటర్ సెక్టోరల్ కోఆర్డినేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం గ్రామాల్లో జులై 1 నుంచి ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎంపీడీవో మల్లికార్జునరావు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య సిబ్బందితో పాటు ఆశా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి పిల్లలను, కుటుంబ సభ్యులను పలకరించి డయేరియా లక్షణాలు ఉన్న ఎడల ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్‌లెట్లు 14 రోజులకు సరిపడా అందచేయాలని కోరారు. అలాగే పరిసరాల పరిశుభ్రత, వాటర్ లీకేజీలు, క్లోరినేషన్, హ్యాండ్ వాష్, శానిటేషన్, వాటర్ టెస్టింగ్ తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులతో అవగాహన కల్పించారు. సమావేశంలో ఈవోపీఆర్డీ టి.ఊహారాణి, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ ఏఈలు శివకృష్ణ, శేతు రామచంద్రరావు, సచివాలయ కార్యదర్శులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్చండి

జిల్లా విద్యాశాఖ అధికారిణి పి.శైలజ



విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకుంటున్న డీఈవో పీ శైలజ

గుంటూరు రూరల్: బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్చేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారిణి పి. శైలజ తెలిపారు. మంగళవారం రూరల్ మండలం 40వ డివిజన్లోని పెదపలకలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. వారికి పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులతో ఆమె మాట్లాడుతూ నివాస ప్రాంతంలోని బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించేందుకు తగిన కార్యాచరణ, చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్, పాఠ్యపుస్తకాలు త్వరగా పంపిణీ చేయాలని సూచించారు. ఇందులో నిబంధనలను పాటించాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం ఏర్పడే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా రోజువారీ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. పిల్లలను బడిలో చేర్పించే క్రమంలో గ్రామస్తుల సహకారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో న్యాయవిజ్ఞాన సదస్సు



వృద్ధులతో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి లీలావతి

నగరంపాలెం: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెంలోని నవీన ఆదర్శ మహిళా మండలి (వృద్ధాశ్రమం)లో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సంస్థ జిల్లా కార్యదర్శి టి.లీలావతి వృద్ధాశ్రమంలో అందిస్తున్న సదుపాయాలు, వారు భుజించే ఆహారాన్ని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తంచేశారు. సీనియర్ సిటిజెన్స్ చట్టాలు, హక్కులపై వివరించారు. ఎవరికైనా రేషన్, ఆధార్ కార్డులు లేకపోతే గుంటూరు న్యాయ సేవాధికార సంస్థ టోల్‌ఫ్రీ నంబర్ 0863–2224886కు లేదా రాతపూర్వకంగా తెలియజేయవచ్చునని తెలిపారు. తద్వారా జిల్లా అధికారులతో సంప్రదించి, చట్ట పరిధిలో న్యాయ సహాయం అందించి, సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. సదస్సులో మహిళా మండలి నిర్వాహకులు, వృద్ధులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్ దృష్టికి స్వర్ణకారుల సమస్యలు



నారా లోకేష్‌కు మెమెంటో అందజేస్తున్న స్వర్ణకార సంఘ నేతలు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని స్వర్ణకారులు తమ సమస్యలను మంగళవారం మంత్రి, స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఉండవల్లిలోని ఆయన నివాసంలో ప్రజాదర్బార్ కార్యక్రమంలో కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంగళగిరికి చెందిన లక్ష్మీ నరసింహ గోల్డ్‌స్మిత్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ స్వర్ణకార కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరామన్నారు. స్వర్ణకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యేకు వివరించామన్నారు. నారా లోకేష్ దీనికి సానుకూలంగా స్పందించారని ప్రతినిధులు తెలిపారు. కార్పొరేషన్ ఏర్పాటుకు విధివిధానాలు, స్వర్ణకారుల సమస్యలపై అధ్యయనం చేసి వివరాలు సమర్పించమన్నారని పేర్కొన్నారు. మంగళగిరిని గోల్డ్‌హబ్‌గా రూపొందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా స్వర్ణకార సంఘ నాయకులు నారా లోకేష్‌కు మెమెంటోను బహూకరించారు.

ఏటా భూసార పరీక్షలు నిర్వహించాలి



కాకుమాను: ప్రతి ఏటా సాగుకు ముందు ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించి నమూనాల ఆధారంగా పంట వేయాలని ఏఓ బి.సుధారాణి అన్నారు. మండల కేంద్రం పెదనందిపాడులో సోమవారం పలు రైతుల పొలాల్లో మట్టి నమూనా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ఏటా ఈ పరీక్షలు చేయించడం వల్ల భూమిలోని పోషకాలను తెలుసుకోవచ్చునని తెలిపారు. వాటి ఆధారంగా సాగు చేస్తే ఆశించిన స్థాయి కంటే అధిక దిగుబడులు సాధించవచ్చునని సూచించారు. భూసారాన్ని పెంచేందుకు తప్పని సరిగా పచ్చిరొట్ట ఎరువులు సాగుకు ముందు వేయాలని తెలిపారు. 2024–25కి సంబంధించి మండలంలో కౌలుకు సాగు చేస్తున్న రైతులు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ ఏడాది 3,594 మంది కౌలు రైతులకు కార్డులు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

ఫిరంగిపురం: పాఠశాల ఈడు చిన్నారులను అంగన్‌వాడీ బడిలో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత అన్నారు. మండలంలోని మునగపాడు గ్రామంలోని బీసీ–2 అంగన్‌వాడీ సెంటర్‌లో అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులు తమ పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. వారికి ఆటలు, పాటలు, విద్యాబోధన, సాంస్కృతిక అంశాలు వంటివి చెబుతారని పేర్కొన్నారు. వీటితోపాటు పౌష్టిక ఆహారం కూడా అందిస్తామని తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు గాయత్రి, ఎంఎల్‌హెచ్‌పీ కీర్తి, ఏఎన్ఎం పాపులమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది మేరి, హెల్పర్లు పాల్గొన్నారు.

ఇసుక నూతన పాలసీని అమలు చేయండి



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

రేపల్లె రూరల్: నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం ఇసుక పాలసీని రూపొందించి ఇసుకను ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధిని కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు పి.నాగాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇసుక క్వారీలను తెరిపించాలని కోరుతూ రేపల్లె తాలూకా భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగాంజనేయులు మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఇసుక పాలసీని తీసుకు రావడంతో పాటు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు గొట్టుముక్కల శ్రీమన్నారాయణ, దాసరి శ్రీనివాసరావు, ఎ. కాళిదాసు, వై. శ్రీనివాసరావు, సూర్యచంద్రరావు, బండారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉపాధి హామీ గ్రామసభలు



వరహాపురం గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచి స్వాతి, పక్కన ఎంపీడీవో శేషగిరిరావు

వరహాపురం(వేమూరు): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో కూలీలకు ఉపాధి కల్పించడం జరిగిందని ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. వేమూరు మండలంలోని వరహాపురం, బలిజేపల్లి, పెరవలి గ్రామాల్లో ఉపాధి పథకం గ్రామ సభలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరంలో కూలీలకు కల్పించిన పనులు, వారికి అందిన వేతనాలకు సంబంధించి నిర్వహించిన సోషల్ ఆడిట్‌పై గ్రామ సభలు నిర్వహించడం జరిగిందన్నారు. ఉపాధి హామీ పథకం పనులతో పాటు పింఛన్ల పంపిణీ విధానంపై గ్రామ సభలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యల్లమాటి స్వాతి, పంచాయతీ విస్తరణాధికారి చొప్పర శేఖర్, ఏపీవో సత్య, పంచాయతీ కార్యదర్శి సుజాత, డీఆర్‌పీ నరేష్ పాల్గొన్నారు.

మాదిగ జన జాతర సభ జయప్రదం చేద్దాం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మాదిగ నాయకులు

వేమూరు: మాదిగల జన జాతర సభను జయప్రదం చేయాలని రాష్ట్ర నాయకులు యల్లమాటి దాసు మాదిగ పిలుపునిచ్చారు. వేమూరులోని మాదిగ దండోర కార్యకర్తలతో బస్టాండ్ సెంటరులో మంగళవారం కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆదేశాల మేరకు జులై 7కు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భవించి 30 వసంతాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈదుమూడిలో నిర్వహించే మాదిగ జన జాతర సభను జయప్రదం చేయాలని కోరారు. ప్రతి గ్రామంలో నుంచి మాదిగ కార్యకర్తలు అధిక సంఖ్యలో కదిలి రావాలని కోరారు. వేమూరు నియోజకవర్గంలోని ప్రతి మండల కేంద్రంలో మాదిగ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కొఠివరపు కోటేశ్వరరావు మాదిగ, చిలుమూరు నాగరాజు మాదిగ, గుంటూరు జిల్లా అధ్యక్షులు కొమరాల శ్రీనివాస్ మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి కిన్నెర నాగరాజు మాదిగ, సీనియర్ నాయకులు మున్నంగి ఐజాక్, యల్లమాటి శ్యామ్ ప్రసాద్ మాదిగ, బుల్లా కోటేశ్వరరావు మాదిగ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో శ్రీ వేంకటేశ్వరస్వామి



వజ్రకిరీటం, అమ్మవార్ల ఆభరణాలతో భక్తులు

గుంటూరు రూరల్: గోరంట్ల గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రవణా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భాగంగా స్వామివారికి అభిషేకాలు, వజ్ర కిరీటాలంకరణ, చేశారు. ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో భాగంగా గోరంట్ల గ్రామానికి చెందిన కాకి బ్రహ్మేశ్వరరావు, మల్లేశ్వరి దంపతులు శ్రీ కాశీ అన్నపూర్ణాదేవి అమ్మవారికి, శ్రీ పద్మావతి అమ్మవారికి, శ్రీ అండాళ్ అమ్మవారికి మూడు రకాల బంగారు తాపడంతో తయారు చేయించిన హారాలను సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంతో అదనపు ఆదాయం

హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ వీఎస్ ధర్మజ



వర్మి కంపోస్టు ఎరువుల తయారీ తీరును క్షేత్రస్థాయిలో తెలుసుకుంటున్న రైతులు

గుంటూరు రూరల్: పంట దిగుబడులు పెంచడంలో తేనెటీగలు ప్రధాన పాత్ర పోషిస్తాయని హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ వీఎస్ ధర్మజ తెలిపారు. వాటి పెంపకంతో రైతులు అదనపు ఆదాయం కూడా పొందవచ్చని పేర్కొన్నారు. మంగళవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతునేస్తం ఫౌండేషన్‌లో ఏర్పాటు చేసిన రైతు శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పంటల్లో పరపరాగ సంపర్కానికి తేనెటీగలు బాగా ఉపయోగపడతాయన్నారు. ప్రస్తుత జీవనశైలి, రైతులు పంటల సాగులో ఉపయోగించే విష రసాయనాల వల్ల తేనెటీగలు అంతరిస్తున్నట్లు తెలిపారు. అవి అంతరిస్తే మనిషి మనుగడే ప్రశ్నార్థకం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సహజ సిద్ధంగా ఉండే తేనెటీగలతోపాటు అవకాశం ఉన్న రైతులు కూడా వాటిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా అదనపు ఆదాయం పొందొచ్చని చెప్పారు. వ్యవసాయంలో పంట దిగుబడులు కూడా పెరిగి లాభపడతారని తెలిపారు. నాబార్డు సహకారంతో రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేంద్రియసాగు విధానం, కషాయాలు, మిశ్రమాల తయారీతోపాటు రైతులు పండించిన వ్యవసాయ దిగుబడులకు విలువ జోడింపు వంటి అంశాలపై శిక్షణ అందించటం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో సేంద్రియ రైతులు మీసాల రామకృష్ణ, శబరీనాథ్, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వేంకటేశ్వరరావు పలు అంశాలను వివరించారు. ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉండే ఆకుకూరలు, కూరగాయలు చాలా వరకు రసాయనాలతో పండించినవే అని పేర్కొన్నారు. రైతులు దిగుబడుల కోసం పిచికారీ చేస్తున్న రసాయన ఎరువుల వల్ల వినియోగదారుల ఆరోగ్యాలు క్షీణిస్తున్నాయని చెప్పారు. సేంద్రియ పంటల ద్వారా రైతుతోపాటు ప్రజల ఆరోగ్యాలు బాగుంటాయని గుర్తుచేశారు. జామ పంటను ఆశించే నెమటోడ్స్ సమస్యకు రసాయనాల్లో సరైన పరిష్కారం లేదని, సేంద్రియ సాగులో ఉందని తెలిపారు. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు, వివిధ యంత్ర పరికాలకు సంబంధించిన వివరాలు, వాటి ధరలు, అవి పనిచేసే విధానాలను యడ్లపల్లి వేంకటేశ్వరరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. శిక్షణకు హాజరైన వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

వానాకాలం.. వ్యాధుల నిలయం

మండే ఎండలు, ఉక్కపోతతో చికాకుపడే సమయంలో పడే వాన హాయిగానే ఉన్నా, వానతో పాటు వచ్చే రోగాలే హైరానా పెడతాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వర్షాలు ప్రారంభమయ్యాయి. అయితే పల్లెల్లో పారిశుద్ధ్యం అంతంత మాత్రంగానే ఉన్న తరుణంలో వ్యాధులు విజృంభించే ప్రమాదం పొంచి ఉంది. ఈ తరుణంలో ప్రజలు అప్రమత్తంగా లేకుండా పలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది.

- వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం
- జాగ్రత్తలు తీసుకోకుంటే జ్వరాల బారిన పడే ప్రమాదం
- ప్రాణాంతక వ్యాధులు దరి చేరకుండా ఆరోగ్య నియమాలు పాటించడమే మేలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

తెనాలిరూరల్: వర్షాకాలం ప్రారంభమవుతోంది. దీంతో పాటే గ్రామాల్లో వ్యాధులు ప్రబలే కాలం కూడా ఆసన్నమవుతోంది. గ్రామాల్లో అపారిశుద్ధ్యం వ్యాధులకు ఆజ్యం పోస్తుంది. దీంతో దోమల బెడద విపరీతంగా పెరిగే అవకావం ఉంది. ఇప్పటికే కొందరు జ్వరాలతో బాధ పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో డయేరియా ప్రబలుతోంది. అప్రమత్తంగా లేకపోతే టైఫాయిడ్, మలేరియా, డయేరియా, డెంగ్యూ, కామెర్లు వంటి వ్యాధులు వ్యాపిస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వర్షాలు కురిసినప్పుడు వచ్చే వ్యాధులు, వాటి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకుందాం.

దోమకాటుతో మలేరియా వ్యాప్తి

ఎనాఫిలిస్ అనే దోమ కుట్టడం వల్ల మలేరియా వ్యాధి సోకుతుంది. మలేరియాలో రెండు రకాలు ఉంటాయి. ఒకటి వైవాక్స్ మలేరియా కాగా, రెండోది ఫాల్సి ఫోం మలేరియా. వైవాక్స్ మలేరియా అంత ప్రమాదకరం కాదు. ఫాల్సిఫోం మలేరియా ప్రాణాంతకమైనది. సరైన చికిత్స తీసుకోకుంటే సెరిబ్రల్ మలేరియాగా మారి రోగి మరణించే ప్రమాదం ఉంది. తీవ్రమైన జ్వరం, రోజు విడిచి రోజు జ్వరం రావడం, తలనొప్పి ఈ వ్యాధి లక్షణాలు. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుని సంప్రదించి సంబంధిత పరీక్షలు చేయించుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ఇంటి పరిసరాల్లో మురుగు నీరు చేరకుండా చూసుకోవాలి
- రాత్రిళ్లు దోమతెరలు వాడాలి
- దోమల నివారణ మందులు వినియోగించాలి
- దోమలు వృద్ధి చెందేందుకు అవకాశం ఉన్న రబ్బరు టైర్లు, తాగేసిన కొబ్బరి బోండాలను దూరంగా పడేయాలి.
- ఇళ్ల ముందు సైడు కాల్వలు ఉంటే దోమల నివారణ మందులు పిచికారీ చేయాలి.

కలుషిత నీటితో టైఫాయిడ్

కలుషిత నీరు తాగడం, బహిరంగ మలవిసర్జన ద్వారా వ్యాప్తి చెందే బ్యాక్టీరియా కారణంగా టైఫాయిడ్ వ్యాధి వస్తుంది. జ్వరం త్వరగా తగ్గకపోవడం, ఒంటి నొప్పులు, తలనొప్పి ఈ వ్యాధి లక్షణాలు. కడుపులో అల్సర్ల వల్ల కూడా టైఫాయిడ్ వచ్చే అవకాశం ఉంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- సురక్షితమైన నీటిని మాత్రమే తాగాలి
- కొళాయి నీళ్లను కాచి చల్లార్చిన తర్వాతే తాగాలి.
- జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్షలు చేయించుకుని వైద్య నిపుణుల వద్దకు వెళ్లి చికిత్స చేయించుకోవాలి.
- బహిరంగ మలవిసర్జనకు స్వస్తి పలికి వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించాలి.
- భోజనానికి ముందు చేతులు శుభ్రపరుచుకోవాలి

ప్రాణాంతకం 'డెంగీ'

క్యూలెక్స్ అనే దోమ కాటు వల్ల డెంగీ వ్యాధి వస్తుంది. సకాలంలో చికిత్స చేయించుకోకుంటే ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది. జ్వరంతో పాటు మోకాళ్ల నొప్పులు ఉంటాయి. రక్త కణాల సంఖ్య తగ్గిపోతుంది. ఒక్కోసారి కోమాలోకి వెళ్లిపోతారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఇంటి ఆవరణ, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- పూలకుండీలు, ఫ్రిజ్‌లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలి.
- దోమల నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలి.

ప్రమాదకరం కామెర్లు

కలుషిత నీరు, ఆహారం వల్ల కామెర్ల వ్యాధి వస్తుంది. మద్యం ఎక్కువ తాగినా కామెర్లు వస్తాయి. మూత్రం పసుపు రంగులో రావడం, కడుపులో నొప్పిగా ఉండడం, వాంతులు, విరేచనాలు కావడంతో పాటు జ్వరం రావడం ఈ వ్యాధి లక్షణాలు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- సురక్షిత నీరు, ఆహారం తీసుకోవాలి
- మద్యం తాగకూడదు
- స్ట్రీట్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి
- ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం.

ఇతరుల నుంచి వ్యాపించే డయేరియా

కలుషిత నీరు తాగడం, కలుషిత ఆహారం తినడం వల్ల డయేరియా వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి త్వరగా వ్యాపిస్తుంది. రోటా వైరస్, కంపైలో బాక్టర్, క్లోస్ట్రీడియం డిఫిషైల్, ఎస్కీరికియా కోలీ, సాల్మనెల్లా వంటి బ్యాక్టీరియాల కారణంగా డయేరియా ప్రబలుతుంది. విరోచనాలు, వాంతులు కావడం, నీరసంగా ఉండడం ఈ వ్యాధి లక్షణాలు. డయేరియా వ్యాధికి ఫ్లూయిడ్స్ ద్వారా చికిత్స అందిస్తారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- కలుషిత నీటిని తాగకూడదు. కాచి చల్లార్చిన నీటినే తాగాలి
- కలుషిత ఆహారం తినకూడదు. వేడి వేడి ఆహారం, తాజా పండ్లను మాత్రమే తీసుకోవాలి.
- పులుపు, కారం ఉన్న ఆహారాన్ని తీసుకోకూడదు.
- డయేరియా వ్యాధి లక్షణాలు ఉన్న వారు చేపలు ఎక్కువగా తినకూడదు. నూడుల్స్, పానీపూరీ, చాట్ వంటి స్ట్రీట్ ఫుడ్‌కు దూరంగా ఉండడమే మంచిది.

ఆరోగ్య నియమాలు తప్పక పాటించాలి



వర్షాకాలంలో కలుషిత ఆహారం, నీరు వల్ల అనేక వ్యాధులు వస్తాయి. అందువల్ల వీటికి దూరంగా ఉండాలి. ఎక్కడపడితే అక్కడ నీరు తాగకూడదు. పులుపు, మసాలాలకు దూరంగా ఉండాలి. రెండు మూడు రోజులకు కూడా జ్వరం తగ్గకపోతే ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుని వైద్యుని సూచనలు పాటించాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. దోమతెరల వాడడం మంచిది.

– డాక్టర్ హనీఫ్, వైద్యాధికారి, సంగం జాగర్లమూడి.

•హుండీ లెక్కింపు

తాడేపల్లి రూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కార్యనిర్వహణాధికారి డీసీహెచ్ వెంకటరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు సమర్పించిన కానుకలను ఉదయం 10 గంటల నుంచి లెక్కించనున్నారు. ఆసక్తి ఉన్నవారు లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చు.